# జనగామ అభివృద్ధే లక్ష్యం

**'మల్లన్న' ఆశీస్సులతో ప్రగతిపథాన నడిపిస్తాం ▪ బీఆర్ఎస్ జనగామ అభ్యర్థి, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి**

- మాట తప్పని మహనీయుడు సీఎం కేసీఆర్
- ప్రజల ఆకాంక్షల మేరకు చేర్యాల రెవెన్యూ డివిజన్
- దివ్యక్షేత్రంగా కొమురవెల్లి మల్లన్న క్షేత్రం
- కొమురవెల్లి మండలంలోని గ్రామాల్లో విస్తృత ప్రచారం
- పల్లెల్లో పల్లా రాజేశ్వర్‌రెడ్డికి అపూర్వస్వాగతం



ఐనాపూర్‌లో పల్లాకు స్వాగతం పలుకుతున్న గీత కార్మికులు



చేర్యాల/కొమురవెల్లి, అక్టోబర్ 27: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకైన కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆశీస్సులతో జనగామ నియోజకవర్గంలోని అన్ని గ్రామాలను అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని బీఆర్ఎస్ జనగామ అభ్యర్థి, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం కొమురవెల్లి మండలంలోని రసూలబాద్, అయినాపూర్, తపాస్‌పల్లి, పోసాన్‌పల్లి, గురువన్నపేట గ్రామాల్లో ఆప్కో రాష్ట్ర మాజీ చైర్మన్ మండల శ్రీరాములు, ఏఎంసీ చైర్మన్ సుంకరి మల్లేశంగౌడ్, ఎంపీపీ తలారీ కీర్తనకిషన్, జడ్పీటీసీ సిలువేరు సిద్దప్ప, మండల అధ్యక్షుడు గీస భిక్షపతితో కలిసి విస్తృత ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో భాగంగా ఆయా గ్రామాలకు వచ్చిన పల్లాకు మహిళలు బతుకమ్మ, బోనాలు, మంగళహారతులతో ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ తీసుకువచ్చిన ధీరుడు సీఎం కేసీఆర్ చెప్పిందే చేస్తాడని, ఎన్నికల కోసం మాయమాటలు చెప్పి ప్రజలను మోసం చేసి ఓట్లు వేయించుకునే సంస్కృతి బీఆర్ఎస్‌కు లేదన్నారు.

**నెల రోజులు బీఆర్ఎస్ కోసం పని చేయండి**

బీఆర్ఎస్ అభ్యర్థిగా ఎన్నికల బరిలో నిలిచిన తన కోసం నెల పాటు పని చేస్తే వచ్చే ఐదేండ్ల పాటు ప్రజల అభ్యున్నతికి పాటుపడతానన్నారు. బీఆర్ఎస్ మేనిఫెస్టోను గడగడపకూ తీసుకెళ్లాలన్నారు. కొమురవెల్లి మల్లన్న క్షేత్రం సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావుల కృషితో ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, ధూళిమిట్ట మండలాల ప్రజల ఆకాంక్ష మేరకు సీఎం కేసీఆర్ చేర్యాలను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కొమురవెల్లి మండలంలోని తపాస్‌పల్లి రిజర్వాయర్‌ను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతానని, దీంతో పరిసర గ్రామాల ప్రజలకు ఉపాధి అవకాశాలు ఏర్పడుతాయన్నారు. అధికంగా వడ్లు పండుతున్న ఈ ప్రాంతంలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కొమురవెల్లి మండలంలో నెలకొన్న సమస్యల పరిష్కారం తనదని, బీఆర్ఎస్‌కు ఓట్లు వేయించే బాధ్యత మీదని స్పష్టం చేశారు. ప్రచార కార్యక్రమాల్లో సర్పంచ్‌లు పచ్చిమడ్ల స్వామిగౌడ్, లకుడపోయిన పోచమ్మ, వాయినాల నిర్మలాపర్శరాములు, వైస్ ఎంపీపీ కాగిత రాజేందర్‌రెడ్డి, ఎంపీటీసీ బచ్చల సాయిమల్లు, ఉపసర్పంచ్ కొండా శ్రీధర్, ఏఎంసీ డైరెక్టర్ మెరుగు కృష్ణ, సీనియర్ నాయకులు పబ్బోజు విజేందర్, మెరుగు శ్రీనివాస్ గౌడ్, వూడెం గోపాల్‌రెడ్డి, బూరుగు నారాయణగౌడ్, ముత్యం నర్సింహులు, గొల్లపల్లి కిష్టయ్య, సార్ల కిష్టయ్య, ఏర్పుల మహేశ్, వకులభరణం నర్సయ్యపంతులు, బుడిగె గురువయ్యగౌడ్, నాగమల్ల శ్రీనివాస్, నాగమల్ల సత్యం, పడిగన్నగారి మల్లేశం, జింకల పర్వతాలు, గదరాజు చందు, కోతి విజయ్ తదితరులు పాల్గొన్నారు.



రసూలబాద్‌లో పల్లాకు పూలతో స్వాగతం పలుకుతున్న ప్రజలు

## బీఆర్ఎస్ మ్యానిఫెస్టోతో సమన్యాయం

సీఎం కేసీఆర్ ప్రకటించిన మ్యానిఫెస్టోలో అన్నివర్గాలకు సమన్యాయం చేసేలా ఉందన్నారు. పెన్షన్ రాని మహిళలు బాధపడాల్సిన పని లేకుండా సౌభాగ్యలక్ష్మి పథకం కింద ప్రతి నెలా రూ.3వేలు ఇవ్వనున్నామని, రూ.400లకు గ్యాస్ సిలిండర్ అందిస్తామన్నారు. కాంగ్రెస్ ప్రజలను మోసం చేసేందుకు 6 గ్యారెంటీలు ప్రకటించిందని, అసలు ఆ పార్టీకే గ్యారంటీ లేదని ఎద్దేవా చేశారు. కర్ణాటకలో అధికారంలోకి రాగానే అక్కడి ప్రజలను మోసం చేసిందని, అక్కడి ప్రజలు తెలంగాణకు వచ్చి ధర్నాలు చేస్తున్నారన్నారు. 3 గంటల కరెంటు ఇస్తామంటున్న కాంగ్రెస్ కావాలో, 24 గంటల కరెంటు ఇస్తున్న బీఆర్ఎస్ కావాలో ప్రజలు ఒక్కసారి ఆలోచించుకోవాలన్నారు.



ఐనాపూర్‌లో ర్యాలీలో పాల్గొన్న పల్లా రాజేశ్వర్‌రెడ్డి



ఐనాపూర్‌లో పల్లాకు మేక పిల్లను అందించిన గొల్లకురుమలు



గురువన్నపేటలో పల్లాకు డప్పుచప్పుళ్లతో స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు



తపాస్‌పల్లిలో మహిళలతో కలిసి డ్యాన్స్ చేస్తున్న బీఆర్ఎస్ జనగామ అభ్యర్థి పల్లా

## బీఆర్ఎస్ జనగామ జిల్లా ఎన్నికల అధికార ప్రతినిధిగా రవి

జనగామ చౌరస్తా, అక్టోబర్ 27: బీఆర్ఎస్ జనగామ జిల్లా ఎన్నికల అధికార ప్రతినిధిగా పట్టణ కేంద్రానికి చెందిన రావెల రవిని నియమిస్తూ పార్టీ జిల్లా అధ్యక్షుడు, జడ్పీ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలోని జనగామ, స్టేషన్ ఘన్‌పూర్, పాలకుర్తి మూడు అసెంబ్లీ నియోజకవర్గాల ఎన్నికల నిర్వహణను రావెల రవి పర్యవేక్షించనున్నారు. ఈవీఎం, బ్యాలెట్, కంట్రోల్ యూనిట్స్, వీవీ ప్యాట్స్ పనితీరును పరిశీలిస్తూ, ఎన్నికల విభాగంతో అనుసంధానమై పార్టీ ప్రతినిధిగా పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. వచ్చే పార్లమెంట్, మున్సిపల్, జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్, వివిధ విభాగాల ఎన్నికలకు కూడా బీఆర్ఎస్ తరపున అధికార ప్రతినిధిగా వ్యవహరిస్తారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అధికార ప్రతినిధి రావెల రవి మాట్లాడుతూ పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని హామీ ఇచ్చారు. మూడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రజల ఆశీర్వాదంతో గులాబీ జెండా ఎగరేస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. అధికార ప్రతినిధిగా నియామకమైన రావెల రవిని పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు అభినందించారు.



పాగాల సంపత్‌రెడ్డి చేతుల మీదుగా నియామకపత్రం అందుకుంటున్న రవి

## 'రైతుబంధు'ను అడ్డుకోవడం సిగ్గుచేటు

మద్దూరు(ధూళిమిట్ట), అక్టోబర్ 27: రైతుబంధును నిలిపివేయాలని కాంగ్రెస్ నాయకులు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయడం సిగ్గుచేటని బీఆర్ఎస్ ధూళిమిట్ట మండల శాఖ అధ్యక్షుడు మంద యాదగిరి అన్నారు. శుక్రవారం ధూళిమిట్ట మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. జనగామలో బీఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి భారీ మెజార్టీతో గెలవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. అంతకు ముందు లింగాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు తుజాలపురం రవి తల్లి మృతి చెందడంతో బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.5 వేలు ఆర్థికసాయం అందించారు. సమావేశంలో సర్పంచ్ ముక్క కనకయ్య, మాజీ జడ్పీటీసీ పేరం భిక్షపతి, ముదిరాజ్ మహాసభ జిల్లా ప్రధాన కార్యదర్శి చొప్పరి సాగర్, సీనియర్ నాయకులు దుబ్బుడు వేణుగోపాల్‌రెడ్డి, నాచగోని వెంకట్‌గౌడ్, జాటోత్ ఖల్‌రాం, తాళ్లపల్లి భిక్షపతి, ఉపసర్పంచ్ పోతరాజుల లింగం, సుందరగిరి యాదగిరి ఉన్నారు.



ధూళిమిట్టలో మాట్లాడుతున్న మంద యాదగిరి

## బీఆర్ఎస్‌తోనే కార్మికులకు న్యాయం

చేర్యాల, అక్టోబర్ 27: అన్ని వర్గాల కార్మికులకు సీఎం కేసీఆర్ మేలు చేస్తున్నారని బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబుయాదవ్ తెలిపారు. శుక్రవారం చేర్యాల పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో బీఆర్‌టీయూ జిల్లా కార్యదర్శి ముస్త్యాల గణేశ్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి హాజరై మాట్లాడారు. కార్మికుల సంక్షేమం, అభివృద్ధికి కృషి చేస్తున్న బీఆర్ఎస్‌కరు కార్మికులు మద్దతు ఇవ్వాలన్నారు. జనగామ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డిని ఆదరించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివశంకర్, కార్యదర్శి మంచె నర్సింహులు, నాయకులు దుర్గం శ్రీనివాస్, మండల అధ్యక్షుడు కంతుల రాజు, అనంతుల మేల్లశం, ఓరిగంటి బాబు, కొలిపాక మధు, బాబు, అన్నబోయిన స్వామి, వెంకట్‌రెడ్డి ఉన్నారు.



మాట్లాడుతున్న బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబుయాదవ్